# మారు బేరం



ఎస్. పురుషోత్తమాచార్య

"అయ్‌గోరూ ! దండం పెడత !"

అరుగుపైన కూచుని వక్కలు కత్తిరిస్తూన్న అవధానులుగారు వారగా నుంచుని పోయిన ఓదేలువంక ప్రశ్నార్థకంగా చూచేరు.

"మా దున్నపోతు కాలు నాని నట్లుందుండి! కుంటుతాంది ! యియ్యాల నా పాలు అరక సాగే యవ్వారం కని పిస్తలేదుండి ! మీరు యాడనన్న పసువుల్ని బదులడుక్క రాండి ! గట్ల యితేనే పని సాగుద్ది ! ఓ దిక్కు పొద్దు పోతాంది ! ఆడ కాల్వలకి నీల్లు కూడొచ్చినయ్ !" అన్నాడు ఓదేలు.

"నాకు రాత్రే ఎందుకు చెప్పలేదీ సంగతి ? ఈ సమయంలో ఊళ్లో పశువు లుంటాయని ఎలా అనుకున్నావ్ ? యిపుడెళ్ళి నన్నెవర్నడగమంటావ్ ? నీ పనులన్నీ యిలాగే

ఏడు స్తయ్ !" విసుక్కున్నారు అవధాన్లుగారు.

"తాటికొండ రామయ్య బండెద్లలో ఓటి సచ్చింది కాదుండి ? ఆయాల నుంచి దాని జతెద్దుని యింటికాడే వుంచుతాండు ! జర మీరెల్లి అడుగుతే యియ్యకపోడు !" అన్నాడు ఓదేలు.

"నీ రెండో దున్నపోతుతో అంత ఎత్తున్న ఎద్దుని అరక కెలా కడతావోయ్ ? సలహా యివ్వటానికయినా యింగితం వుండాలి !" అన్నారు అవధాన్లుగారు.

"మాధారంలో సిన్నింటి కిష్టయ్య యింటికాడ కూడా ఓ ఎద్దుని కట్టేసి వుంచుతాడుండి ! నేను మూడు దినాల కాణ్ణించి చూస్తాన్న ! ఎల్లి మీరాయన్ని కూడా ఎద్దు నడుగుండి !" అన్నాడు ఓదేలు మళ్ళీ.

"మరి నీ రెండో దున్నపోతు నేం చేస్తావ్ ? అలా వెళ్ళి ఆవాల సీతయ్యని నేను అడిగానని చెప్పి వాళ్ళ దున్నపోతు నీవేళ కిస్తాదేమో చూడు ! ఈ లోగా నేను రామయ్య దగ్గరి కెళ్లొస్తాను" అంటూ లేచారు అవధాన్లుగారు.

"దాని కాలులో కూడా ముల్లిరిగినట్లుందుండి ! మంగలోడికి సూపిస్త !" నసుగుతూ ప్రక్కచూపులు చూడ సాగేడు ఓదేలు."

వాడి ఆ వాలకాన్ని కనిపెట్టి పళ్ళు కొరికేరు అవధాన్లుగారు.

"తన దున్నపోతొకటి కాలుకదపటం లేదని తెలిసి రెండోదాన్ని కూడా కష్టపెట్టదలుచుకోలే దీ వెధవ!" అనుకున్నా రాయన.

"సరే వెళ్ళు ! నేనేదో అఘోరిస్తాను. వక్కల పళ్లేన్ని ప్రక్కనున్న బల్లపై గిరాటువేసి వీధిలోకి నడిచే రాయన."

అవధాన్లుగారు శివాలయంలో అర్చకులు. దేవుని మాన్యాన్ని నమ్ముకుని స్వంతమయిన ఓ దున్నపోతుల జత తోనూ, పనివాడు ఓదేలు అరకతోనూ వ్యవసాయం సాగిస్తూన్న పేద బ్రాహ్మణుడు.

అవధాన్లుగారిని చూస్తూనే రామయ్య లేచి చేతులు జోడించేడు.

"రామయ్యా ! మా ఓదేలు అరక ఈవేళ సాగేట్టులేదు. మీ ఎద్దు నీ పూటకు మా పొలానికి తోలాలోయ్ ! ఓ మడి మిగిలింది. దుక్కి సాగించి జాగ్రత్తగా మళ్ళీ మీ యింటి కంపిస్తాను" అన్నారు అవధాన్లుగారు.

"దాందేవుందుండీ ? తోలుకపోండి ! కాని మా పెద్దెద్దు సచ్చినకాణ్ణుంచి దీని మొహ సూడలేకపోతున్ననుండి ! దీన్నిట్ల యింటికాడుంచే బదులు అమ్ముదావనుకుంటున్ననుండి ! నా కాకండ్లే కనపడి సావవయ్యె ! గా నవాబు

పేటదాక పోయిరావాలంటె పానం పోయేటట్లుంది. ఎవురన్న దీన్నమ్మి పెడతరేమో అని చూస్తాన్న!" అన్నాడు రామయ్య.

"ఎంత కమ్ముతావేవిటి ?" అన్య మనస్కంగానే ప్రశ్నించేరు అవధాన్లు గారు.

"ఎనిమి దొందలన్నా రావుండి ! అంతకు తక్కువయితే నేను మును గుత !" అన్నాడు రామయ్య సాలోచనగా.

"సరే ! నా పని కానీవేళ! దీన్నమ్మి పెట్టే ఉపాయం నే చూస్తానులే" అంటూ ఎద్దువంక నడిచేరు అవధాన్లు గారు.

ఏపుగా పెరిగివున్న ఆ ఎద్దు ఆయన్ని చూసి తొట్రుపాటుతో లేచి నుంచుంది. దాని నుదురు నోసారి తడిమి కట్టుతాడుని విప్పి చేతపట్టుకుని వీధిలోకి దారితీ సే రాయన.

ఆ ఎద్దు నలా తీసికెళ్ళి తమ పొలం లోని పాకలో కట్టేసి ప్రక్కనే దగ్గర్లో వున్న మాధవరం గ్రామంలోని కిష్టయ్య యింటివంక నడిచే రాయన.

వీధి అరుగుపైన కూచుని చుట్టని చుట్టుకుంటూన్న సిన్నింటి కిష్టయ్య దిగ్గున లేచి అవధాన్లుగారికి నమస్క రించేడు.

"కిష్టయ్యా ! మీ ఎద్దు నీ పూటకు మా పొలం పనికి తోలాలోయ్ ! ఒక్కటే మడి మిగిలింది. మా ఎద్దు కాలొకటి పనికిరాకుండా పోయిం దీవేళ. దుక్కి కాగానే మా ఓదేలుచేత జాగ్ర త్తగా పంపిస్తాను" అన్నారు అవధాన్లు గారు.

"మీకు గామాత్రం సేయకపోతే పురుగుల్ల పడిపోనుండి ? అయినా మా యింటికాడ ఎద్దుందని మీకెట్ల తెలిసుం దుండి ?" ఆశ్చర్యంగా ప్రశ్నించేడు కిష్టయ్య.

"ఎలాగో అలాగున తెలిసింది కాని అలా ఒంటెద్దు నింటిపట్టున వుంచి ఏం చే యా ల ను కుం టున్నావోయ్ ?" ఎదురు ప్రశ్న వేసేరు అవధాన్లుగారు.

"ఏంలేదుండి ! సవారి బండిని చేయించిన ! యింకో ఎద్దుని కొనాలను కుంటాన్న" అన్నాడు కిష్టయ్య.

అది వింటంతోనే సింహయ్యగారి బుర్రలో ఏదో మెరిసింది.

"నాకు తెలిసిన వాళ్ళదగ్గరో ఎద్దుం దోయ్ ! నెల్లూరుగి త్తలా వుంటుంది. కొంటావా మరి ! అసలు నీవెంతలో కొనాలనుకుంటున్నావ్ ?" ఆస క్తిగా ప్రశ్నించేరు అవధాన్లుగారు.

"పది పన్నెండొందలేనా పెట్టంది, మంచెద్దేదొ స్తదుండి ?" సాలోచనగా పలికేడు కిష్టయ్య.

అవధానులుగారి బుర్రలో ఆశాదీపం వెలిగింది.

"ఆ ! అలా అవుతే ఫరవాలేదోయ్!

అతను కూడా పన్నెండొందలకి పది కూడా తగ్గనంటున్నాడు. మరి రేపే వెళ్ళి బేరం ఫైసలా చేసి ఎద్దుని తీసుకు రానా ? పశువు నీ యింట అడుగేసాకే దబ్బిద్దువుకానీ !" అంటూ కుతూహలంగా చూచేరు అవధాన్లుగారు.

ఆయనవంక అదోలా చూచేడు కిష్టయ్య.

"అట్లాగేనుండి ! కాని ఎద్దుని చూసుకోవద్దా ?" మెల్లిగా ప్రశ్నించేడతను.

"చూడవలసిన పనే లేదోయ్ ! అసలైన జాతి గిత్తలా వుంటుంది. నాపై అమాత్రం నమ్మకంలేదూ ?" అన్నారు అవధానులుగారు.

కిష్టయ్య రెండు క్షణాలు ఆలోచించేడు.

"సరేనుండి ! పైకం సిద్ధంగనే వున్నది. మీరు ఎద్దునయితే తోలుక రండి !" అంటూ లేచి వెళ్ళి తన ఎద్దుని తీసుకుని వచ్చి కట్టుత్రాటిని అవధానులుగారి కందించేడు కిష్టయ్య.

అవధానులుగారు ఉత్సాహంగా కిష్టయ్య ఎద్దుని తోలుకుని తమ పొలానికి బయలుదేరేరు. దోవనిండా ఆలోచన లాయన మనస్సులో అలుముకుపోసాగేయి.

"ఈ బేరాన్ని ఏదోరకంగా ముడి పెడితే ఓ నాలుగొందలు సునాయాసంగా చేతిలో రాలుతయ్ ! ఓ నాలుగొందలు తమ వద్దెలాగూ వున్నవి. అంతా కలిపి ఎనిమిదివందల్లో మరో జత దున్నపోతులెలాగూ రాకపోవు. దాంతో వచ్చేసంవత్సరం ఓదేలు పీడ వదిలించుకుని కూలీలతో స్వంతంగా వ్యవసాయం ప్రారంభించవచ్చును," అనుకున్నారాయన.

అంతలోనే ముందుగా రామయ్యకి చెల్లించవలసిన డబ్బు విషయం జ్ఞాపకం వచ్చిం దాయనకి. రామయ్యా ఎంత మెతకవాడయినా డబ్బు చేతిలో పడందే ఎద్దుని వదలగలడన్న నమ్మకం ఏమాత్రమూలేదు. ఏంచేయాలా అన్న ఆలోచనలో పడిపోయారాయన.

తటాలున వారికి మార్గం గోచరించింది. మర్నాడు ఎలాగూ శుక్రవారం. నవాబుపేట సంతలో తమ దున్నపోతుల జతలోనుంచి ఒకదాన్ని అమ్మేస్తే నాలుగొందలు తప్పక వస్తాయి. తమ వద్దెలాగూ వున్న మిగిలిన నాలుగొందల్ని కలిపి రామయ్యకి డబ్బుని చెల్లించి ఆ ఎద్దుని తీసికెళ్ళి కిష్టయ్య కంటగడితేగాని తమకు లాభం చేతుల్లోకి రాదు. ఆ తర్వాత మళ్ళీ సంతకెళ్ళి ఒకేసారి మూడు దున్నపోతుల్ని కొనేయవచ్చునని స్థిమితపడ్డారాయన. తాము ముందుగా డబ్బడుగుతే కిష్టయ్య కనుమానం వస్తుందని ఎద్దు నప్పజెప్పాకే డబ్బివ్వవలసిందిగా ఎలాగూ చెప్పారు. అతడికి ఎద్దు నచ్చిందా సరేసరి ! నాలుగొందలు తమ అనుభవంలోకి వస్తాయి. లేదూ అతణ్ణి

వేయిరూపాయలకయినా అంగీకరింప చేయవచ్చును. చివరికి అదీ కుదరక పోతే ఆ ఎద్దును తామే స్వయంగా సంతకి తోలుతే ఆమాత్రం డబ్బా తమకి రాకపోదు. అందువల్ల ఈ బేరం వల్ల లాభవే కాని నష్టంమాత్రం రాదన్న నిర్ణయానికొచ్చే రాయన.

"దాంతో మర్నాడు వేకువ ఝామున్నే లేచి తమ ఆలోచనని రహస్యంగా వుంచాలన్న ఆలోచనతో యింట్లోని ఆడవాళ్ళకి కానీ, వృద్ధులయిన తలిదండ్రులకి కానీ చెప్పా చేయకుండా దున్నపోతు నోదాన్ని స్వయంగా సంతకు తోలుకెళ్ళేరు అవధానులుగారు.

సంతలో అమ్మకం ముగిసిన వారికి ఆశించిన డబ్బుకంటే ఓ ఏభై అధికంగానే డబ్బు ముట్టింది. నవాబుపేటనుంచి తిన్నగా జనగామకు పరిగెత్తి యింట్లోకి కావాల్సిన చిల్లర మల్లర సరుకుల్ని కొనుగోలుచేసి కాలినడకన మాధవరం చేరుకున్నారు అవధానులుగారు.

కిష్టయ్య యింట్లో కడుగుపెడుతూనే అతనింటి ఆవరణలో కట్టివేసున్న జత ఎద్దుల్ని చూడగానే అవధానులుగారికి క్షణం మతి చలించింది.

"రాండి ! రాండి ! అయ్‌గోరూ ! దండం పెడత! కొత్తెద్దుని చూసిన్రా?" అంటూ యింట్లోంచి యివతలికొచ్చేడు కిష్టయ్య.

"ఏమిటిది ?" అవధానులుగారు లోగొంతుకతో ప్రశ్నించేరు.

"మీ కింక కష్టం వొద్దండి అయ్‌గోరూ ! నిన్న మీరు పొలం కాణ్ణుంచి మా ఎద్దుని ఓదేలుచేత పంపిన్రు కదుండి ? అది మీ ఊరి తాటికొండ రామన్న కాడున్న ఎద్దు జాడ చెప్పిండు ! దాంతో యియ్యాల పొద్దున్నె మీ ఊరి కురికిన ! మీరింటి కాడ లేరుగాదుండి ! మొత్తానికి బేరం ఫైసల చేసుకుని తొమ్మిదొంద లిచ్చి ఎద్దుని కొట్కొచ్చుకున్న !" కిష్టయ్య ఉత్సాహంతో చెబుతోంటే నీరుగారి పోయేరు అవధానులుగారు.

"ఓదేలుచేత కిష్టయ్య ఎద్దుని పంపించకుండా వుంటే విషయం యింత వర కొచ్చేదే కాదు. ఎంత పొరపాటు జరిగిపోయింది ? ఔరా ఓదేలూ ! ఎంత పనిచేసేవురా ?" అనుకుంటూ దిగాలుగా నుంచునిపోయిన అవధాన్లుగారి వంక వింతగా చూచేడు సిన్నింటి కిష్టయ్య. ఎటూ తోచక బొడ్డులోనుంచి ఓ అయిదు రూపాయల కాగితాన్ని వెలికి లాగేడతను.

"అయ్‌గోరూ ! యిదోండి ! ఈ అయిదు రూపాయల్ని నా పేర దేవుడికి సదివించుండి ! సవకలో మంచి గొడ్డు దొరికింది. అంతా ఆడి దయే !" అంటూన్న కిష్టయ్యనుంచి ఆ కాగితాన్నందుకుని బరువుగా వీధిలోకి అడుగు వేసేరు అవధానులుగారు.

"ఏవండీ ! ఉదయంనుంచీ ఎక్కడి కెళ్లేరేవిటి ? మన దున్నపోతొకటి కన్పించటంలేదని ఓదేలు ఒహటే హడావిడిచేస్తూ యిపుడే దాన్ని వెతక టానికని అలా ఊళ్లోకి వెళ్లేడు. యిహ తాటికొండ రామయ్య మీకోసం రెండు సార్లొచ్చి వెళ్లేడు. పైగా మాధవరం నుంచెవరో వచ్చి మీ గురించి వాకబు చేసేరు." యింట్లోకి అడుగుపెడుతూనే దండకం చదివింది అవధానులుగారి ఆడమనిషి.

సమాధానంకూడా చెప్పకుండా భుజంపైనున్న మూట నందించి అన్య మనస్కంగా వీధిలోకి వెడుతోన్న భర్త వంక అదోలా చూచిందా యిల్లాలు.

రామయ్య యింట్లోకి అడుగుపెడు తూనే అతనింట వున్న ఓ క్రొత్త వ్యక్తిని చూచి అవధానులుగారి మొహం వెలవెలాపోయింది. అంతేకాక రామ య్యింటి ఆవరణలో కట్టేసివున్న దున్న పోతుని చూడగానే వారికి మతి భ్రమించి పోయింది.

"అయ్‌గోరూ ! మీ యింటికి రెండు మాట్లొచ్చిన! మీరేడికి పోయిన్రోఏమో? మీకు కష్టం వొద్దుండి ! వంద లాభానికి మా ఎద్దుని మాధారం కిష్టయ్యకమ్మిన!" ఉత్సాహంగా పలికేడు రామయ్య.

కాని అవధానులుగారికి మాత్రం రామయ్య పలుకు లేమాత్రమూ విని పించలేదు. వారి దృష్టిమాత్రం శూన్యంగా రామయ్య ప్రక్కనే వున్న క్రొత్తవ్యక్తిపై కేంద్రీకృతమైపోయింది.

"ఈడు మా బామ్మర్ది ఈరయ్యండి ! మా మామ తాటికొండ కిల్లింటకం తెచ్చుకున్నడని సెప్పిన కాదుండి ? ఆడే ఈడు !" అన్నాడు రామయ్య, అవధానులుగారి వంక వింతగా చూస్తూ.

"ఓ బావా ! అంగట్లో ఆ దున్న పోతుని కొన్నది ఈరికాణ్ణేనే !" అన్నాడు వీరయ్య, రామయ్యవంక తిరుగుతూ.

రామయ్య ఆశ్చర్యంతో తల మునక లయ్యేడు.

"గదేందుండి అయ్‌గోరూ ? మీ రంగడి కెందుకు పోయిన్రు ? దున్న పోతు నెందు కమ్మిన్రు ? బేరం గీరం మీకేం తెలుసుండి ? గీ దున్నపోతుని గంత సవక కెవడన్న అమ్ముతడా ? అన్నన్న ! గిదేం యవారముండి ? అసుంటి పోతు మీ కిపుడు ఆరొందలు పెడితె మాత్రం మల్లొస్తదా ?"...

రామయ్య పలుకులు అవధానులుగారి అంతరంగంలో చిల్లులు వేయసాగాయి.

నోరు మెదపక వెనుదిరిగి గబగబా వెళ్ళిపోతున్న అవధానులుగారివంక గుడ్లప్పగించి చూస్తూ వుండిపోయేరు రామయ్యా, వీరయ్యలు.

వీధి గుమ్మవంక అడుగులేస్తూన్న అవధానులుగారిని గుర్తించి విసురుగా లేచి నుంచుని రంకె వేస్తూ కట్టుత్రాడుని లాక్కునే ప్రయత్నం చేయసాగింది, అవధానులుగారి ఆ అమ్ముడుబోయిన మహిషరాజం.